సాక్షి నిజామాబాద్

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



పేదింటి బిడ్డ.. క్రీడల్లో దిట్ట

పేదరికంలో పుట్టి ఆర్థిక పరిస్థితులు సహక రించకపోయినా సాఫ్ట్‌బాల్ క్రీడలో నైపుణ్యాన్ని చాటుతోంది క్రీడాకారిణి కీర్తన.

- 8లో ▸



తగ్గిపోతున్న 'ఉపాధి'

ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇస్తూనే ఉంది. కూలీల పనిదినాల సంఖ్య తగ్గుతోంది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

37.1 /14.6

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు సీఎం రేవంత్ రాక

- పట్టభద్రులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం జిల్లా కేంద్రానికి రానున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి గార్డెన్స్‌లో మధ్యాహ్నం నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొననున్నారని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరపున సీఎం రేవంత్‌రెడ్డి పట్టభద్రులతో మాట్లాడుతారని తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రత

ఖలీల్‌వాడి: సీఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి ఆదివారం తెలిపారు. భూమారెడ్డి ఫంక్షన్‌హాల్‌ను తమ అధీనంలోకి తీసుకున్నామని, బందోబస్తులో ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు 200 మంది పాల్గొంటారన్నారు.

ప్రశాంతంగా ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ, బీసీ, మైనార్టీ సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీసెట్–2025) ప్రశాంతంగా ముగిసినట్లు బాసర జోన్ ఇన్‌చార్జి జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్‌రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 20 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 7,906 మంది విద్యార్థులకు 7,651 మంది హాజరుకాగా 255 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ధర్మారం(బీ) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ విభాగం అసిస్టెంట్ సెక్రెటరీ శ్రీదేవి తనిఖీ చేశారు. ఆమె వెంట జోనల్ ఆఫీసర్‌తోపాటు ప్రిన్సిపల్ మాధవీలత ఉన్నారు.

విద్యారంగాన్ని గాలి కొదిలేసిన ప్రభుత్వం



సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని, ఉపాధ్యాయుల సమస్యలను పూర్తిగా గాలికొదిలేసిందని ఎంపీ అర్వింద్ ధర్మపురి విమర్శించారు. నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో ఉన్న మున్నూరుకాపు కల్యాణమండపంలో ఆదివారం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల కొరత, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడంలేదన్నారు. హామీలు అమలు చేయకుండా ఏం ముఖం పెట్టుకొని కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా టైంపాస్ కోసం వస్తున్నారని ఎద్దేవా చేశారు. మరో ఏడాది గడిస్తే ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉండదన్నారు. శాసనమండలిలో విద్యారంగం, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి పాల్గొన్నారు.

కామారెడ్డి బల్దియాకు ఐటీ షాక్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియాకు ఆదాయపు పన్ను శాఖ షాక్ ఇచ్చింది. 18 ఏళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో మున్సిపల్ అకౌంట్లను ఫ్రీజ్ చేసింది. బల్దియా 2007–08 నుంచి ఆదాయపు పన్ను చెల్లించకపోవడంతో రూ.39 లక్షలకుపైగా బకాయిలు ఉన్నాయి. ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలంటూ ఇప్పటికే 15 కుపైగా నోటీసులు ఇచ్చారు. అయినా బల్దియా నుంచి స్పందన లేకపోవడంతో ఐటీ అధికారులు ఈనెల 17న మున్సిపాలిటీకి సంబంధించిన బ్యాంకు ఖాతాలన్నింటిని ఫ్రీజ్ చేశారు. ఖాతాలు స్తంభించడంతో ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయి విషయం వెలుగులోకి వచ్చింది. ఖాతాలు ఫ్రీజ్ కావడంతో ఉద్యోగులు, కార్మికుల వేతనాల, అత్యవసర బిల్లుల చెల్లింపుల కోసం అధికారులు నానా పాట్లు పడాల్సి వస్తోంది.

ఎత్తేసిన బోర్లు.. నెర్రెలుబారుతున్న భూములు



ముషీర్‌నగర్‌లో వరిని మేస్తున్న గొర్రెలు

▪ రెండున్నర ఎకరాలు ఎండింది



ఈ రైతు పేరు రాజు. సిరికొండ మండలం ముషీర్ నగర్‌కు చెందిన ఇతను నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. బోరు ఎత్తిపోవడంతో రెండున్నర ఎకరాల పొలం ఎండిపోయింది. మరో ఎకరన్నరకు అడపాదడపా నీళ్లందుతున్నాయి. ఎండిన పొలంలో గొర్రెలు మేస్తున్నాయి. రాజుకు వేలాది రూపాయల నష్టం వాటిల్లింది.



గడ్కోల్‌లో నెర్రెలుబారిన వరి మడి



కొండూర్‌లో నీరు పడని బోరుబావి

యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరిపై రైతులు ఆశలు వదులుకునే పరిస్థితి వచ్చింది! సిరికొండ మండలంలో 24వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు వరి వేశారు. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురిసినా.. సీజన్ చివరలో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడొద్దని ముందుచూపుతో సుమారు రెండు నెలలముందే వరినాట్లు వేసిన రైతుల ఆశలను 'బోర్లు ఎత్తేశాయి'. ఈ ఏడాది జనవరి నుంచే వేగంగా భూగర్భ జలమట్టం తగ్గిపోయింది. కొన్ని గ్రామాల్లో పొలాలు పొట్ట దశకు చేరుకోకముందే, మరి కొన్ని గ్రామాల్లో పొలాలు ఈనిన తర్వాత భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. కళ్ల ముందే వరి సాగవుతున్న మడులు నెర్రెలు పారుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు పొలాలను కాపాడుకునేందుకు వెయ్యి ఫీట్ల వరకు బోర్లు తవ్విస్తున్నా చుక్క నీరు పడడం లేదు. మరి కొందరు ట్యాంకర్ల ద్వారా వరికి నీళ్లు పారిస్తున్నారు. ముషీర్‌నగర్, హుస్సేన్‌నగర్ గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. కొండాపూర్, తూంపల్లి, గడ్కోల్, తాటిపల్లి, మైలారం, సిరికొండ, చిన్నవాల్గోట్, కొండూర్, రావుట్ల, న్యావనంది, చీమన్‌పల్లి తదితర గ్రామాల్లో భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. – సిరికొండ



బోరులో నుంచి సన్నధారగా వస్తున్న నీరు

అటవీ శాఖలో ఇమడలేక..

- ఉద్యోగాలను వదులుకుంటున్న బీట్ ఆఫీసర్లు
- వేరే శాఖల్లో ఉద్యోగాలు వెతుక్కుంటున్న వైనం
- నాలుగేళ్లలోనే 87కు చేరుకున్న ఖాళీలు
- అడవుల సంరక్షణకు కరువైన సిబ్బంది



ఫీల్డ్ విజిట్‌లో శిక్షణ పొందుతున్న ఎఫ్‌బీవోలు (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): అటవీ శాఖ ఖాళీ అవుతోంది. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు(ఎఫ్‌బీవో) శాఖలో ఇమడలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. టైమింగ్ లేకుండా విధులు నిర్వర్తించడంతోపాటు పని ఒత్తిడి కూడా పెరగడంతో ఎఫ్‌బీవో ఉద్యోగం చేయడానికి ఇష్టపడడం లేదు. టీచర్, పోలీస్, గ్రూప్స్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తుండగా ఇప్పటికే చాలా మందికి ఉద్యోగాలు వచ్చాయి. అడవుల సంరక్షణ కోసం ప్రభుత్వం రాత పరీక్ష నిర్వహించి

మొత్తం ఎఫ్‌బీవో పోస్టులు	153
పని చేస్తున్న వారు	66
ఖాళీలు	87

బీట్ ఆఫీసర్ల నియామక ప్రక్రియ చేపట్టగా, నాలుగేళ్ల క్రితం కొత్తగా 80 మంది వరకు నియమితులయ్యారు. వారిలో నుంచి సుమారు 50 మందికి పైగా బీట్ ఆఫీసర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి వేరే శాఖల్లో స్థిరపడ్డారు. జీతాలు తక్కువైనా ఫర్వాలేదంటూ ఇతర శాఖల్లో ఉద్యోగాల కోసం పరీక్షలు రాయడం అటవీ శాఖలో ఉద్యోగం ఎంత కఠినమైందో తెలుస్తోంది. అడవులు, వన్య ప్రాణులను సంరక్షించడంతోపాటు అటవీ భూములను కాపాడడం ప్రతిరోజూ టాస్క్‌లా మారింది. ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేయడంతో తమకు కూడా పోడు పట్టాలు వస్తాయనే ఉద్దేశంతో పలు చోట్ల గిరిజనులు భూములను దున్నడం ప్రారంభించారు. ఈ ప్రాంతాలకు వెళ్లిన బీట్ ఆఫీసర్లపై బెదిరింపులు, దాడులు జరుగుతున్నాయి. పైగా కొందరు పై స్థాయి అధికారుల వేధింపులు, సెలవులు ఇవ్వకపోవడం కారణంగానే బీట్ ఆఫీసర్ ఉద్యోగం చేయడానికి భయపడుతున్నారనే ఆరోపణలున్నాయి. భద్రత లేని ఒత్తిడి కలిగిన ఉద్యోగం తమకొద్దని చాలామంది వేరే ప్రభుత్వ ఉద్యోగాలకు వెళ్తున్నారు. ఇంకా చాలా మంది పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు.

ఉన్నవారికి అదనపు బీట్‌లు

జిల్లాలో ప్రస్తుతం 66 మంది ఎఫ్‌బీవోలు మాత్రమే పని చేస్తుండగా, 87 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీలు పెరిగిపోవడంతో అటవీ శాఖ అధికారులు ప్రస్తుతం పని చేస్తున్న బీట్ ఆఫీసర్లకే అదనపు బీట్లు అప్పగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో బీట్‌కు అంటే 1500 నుంచి 2వేల ఎకరాలకు ఒక బీట్ ఆఫీసర్ ఉండాలి. కానీ ఎఫ్‌బీవో పోస్టుల ఖాళీలతో ఒక్కొక్కరికి రెండు నుంచి ఐదు బీట్‌లు ఇచ్చి అదనపు భారం వేస్తున్నారు. దీంతో పని ఒత్తిడి పెరుగుతోందని ఎఫ్‌బీవోలు వాపోతున్నారు. ప్రధానంగా అటవీ భూములు, పోడు సమస్యలు ఎక్కువగా ఉన్న ఇందల్వాయి, సిరికొండ, వర్ని రేంజ్‌ల పరిధిలో చాలా ఎఫ్‌బీవో పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఈ రేంజ్‌ల పరిధిలో అడవుల సంరక్షణ కష్టంగా మారింది.

సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నాం



జిల్లాలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల కొరత ఉన్న విషయం వాస్తవమే. వేరే ఉద్యోగాలు రావడంతో చాలా మంది ఎఫ్‌బీవో ఉద్యోగాన్ని వదులుకుంటున్నారు. ప్రభుత్వం మళ్లీ రిక్రూట్ చేసి పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుంది. అప్పటి వరకు అడవుల రక్షణకు ఇబ్బంది లేకుండా ఉన్న సిబ్బందితోనే సర్దుబాటు చేస్తున్నాం.

– వికాస్ మీనా, జిల్లా అటవీశాఖ అధికారి

ఉద్యోగాల పేరుతో గల్ఫ్ ఏజెంట్ మోసం

- 35 మందికి రూ.3.50 కోట్లు టోకరా!



నందిపేట్(ఆర్మూర్): విదేశాలలో ఉపాధి అవకాశాలు చూపిస్తానని చెప్పి ఓ గల్ఫ్ ఏజెంట్ పలువురిని మోసం చేశాడు. వివరాలిలా ఉన్నాయి. నందిపేట మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ కస్ప్రా శ్యామ్ దుబాయితోపాటు పలు దేశాల్లో రూ. లక్షల్లో జీతాలు ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి నిరుద్యోగులను నమ్మించాడు. ఏడాది క్రితం అతడిని నమ్మి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన పలువురు యువకులు డబ్బులు ఇచ్చారు. ఇలా 35 మంది నుంచి రూ. 3.50 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. కాగా కొందరిని నకిలీ వీసాలతో దుబాయి పంపించి వారికి ఎలాంటి పనులు లేకుండా గదులలో బంధించి పాస్‌పోర్టులు లాక్కున్నట్లు తెలిసింది. అక్కడ సుమారు మూడు నెలలపాటు ఇబ్బందులు పడ్డవారు ఎలాగోలా స్వదేశానికి చేరారు. మోసం చేసిన ఏజెంట్ కోసం 7 నెలల నుంచి గాలిస్తున్నారు. ఇటీవల అతడు నందిపేట మండలం అయిలాపూర్ గ్రామంలో ఉన్నాడని తెలుసుకుని గ్రామానికి వచ్చారు. డబ్బుల గురించి అడగ్గా ఏజెంట్ కస్ప్రా శ్యామ్, అతడి అనుచరులు దాడి చేసినట్లు తెలిసింది. ఈ విషయమై నందిపేట ఎస్సై చిరంజీవిని సంప్రదించగా.. రెండు రోజుల క్రితం బాధితులు స్టేషన్‌కు వచ్చారన్నారు. అయితే తమకు లిఖిత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని పేర్కొన్నారు.

యూఏఈకి ఉచిత వీసాలు

- మార్చి 1న జిల్లా కేంద్రంలో ఇంటర్వ్యూలు
- ఏడీఎన్‌హెచ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ
- క్యాటరింగ్, సపోర్టింగ్ సర్వీసెస్‌లో ఉద్యోగాల భర్తీకి మేళా



ఏడీఎన్‌హెచ్ విడుదల చేసిన బ్రోచర్

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందాలనుకునే వలస కార్మికులకు మరోసారి ఉచితంగా వీసాలు జారీ చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ప్రభుత్వ రంగ సంస్థ ఏడీఎన్‌హెచ్ కంపెనీ లైసెన్స్ ఏజెన్సీ జీటీఎం ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నది. మార్చి 1న ఏడీఎన్‌హెచ్, జీటీఎం సంస్థలు సంయుక్తంగా మేళా నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నారు. కంపెనీల ప్రతినిధులే నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించనుడడంతో ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని జీటీఎం చైర్మన్ సతీశ్‌రావు 'సాక్షి'తో చెప్పారు. ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టు ఉండి, బేసిక్ ఇంగ్లిష్‌లో మాట్లాడేవారు ఉద్యోగానికి అర్హులను పేర్కొన్నారు. 21 నుంచి 36 ఏళ్లలోపు వయసు వారికే అవకాశం ఉందని స్పష్టం చేశారు. వివరాలకు నిజామాబాద్, ఆర్మూర్, జగిత్యాల్, సిరిసిల్ల, సికింద్రాబాద్‌లోని జీటీఎం సంస్థ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

పాపారావు క్షేత్రంలో సాగు పాఠాలు

- 'సాక్షి' కథనాల నేపథ్యంలో క్షేత్ర సందర్శనకు క్యూ
- ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలనపై విద్యార్థుల ఆసక్తి
- విజ్ఞానాన్ని అందిస్తున్న ఆ వ్యవసాయ క్షేత్రం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి రైతు పాపారావు



రామఫలాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అగ్రికల్చర్‌లో 'కల్చర్' ఉంది.. వ్యవసాయంలోనే 'సాయం' ఉందనే విషయాన్ని గురించి మరింతగా తెలుసుకునేందుకు తద్వారా సాగు పరిజ్ఞానాన్ని సముపార్జించుకునేందుకు విద్యార్థులు ముందుకు కదులుతున్నారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లలో గడిపే విద్యార్థులు మెల్లగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించేందుకు మొగ్గు చూపుతున్నారు. చాలా పాఠశాలలు ప్రతి ఏటా విద్యార్థుల కోసం విహార యాత్రలు నిర్వహిస్తున్నాయి. అయితే ఇటీవల కాలం నుంచి జిల్లాలో పాఠశాలలు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాయి. వ్యవసాయ క్షేత్రాలను చూపించేందుకు విద్యార్థులను తీసుకెళ్తున్నాయి. ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామంలో రైతు కరుటూరి పాపారావు చేస్తున్న ప్రకృతి వ్యవసాయంపై ఇటీవల 'సాక్షి'లో కథనాలు వచ్చాయి. దీంతో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పాపారావు వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ వ్యవసాయంపై శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చుట్టు పక్కల జిల్లాల నుంచి ఔత్సాహిక రైతులు తరలివచ్చారు. కార్యక్ర మానికి సంబంధించి 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని చూసిన జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వరుసగా పాపారావు క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. ఇక్కడ ఎనిమిది ఎకరాల్లో ప్రకృతి విధానంలో వరి సాగు, మరోవైపు తక్కువ స్థలంలో అన్నిరకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, దుంపలు, పసుపు పంటలను సేంద్రియ విధానంలో పండిస్తున్న విధానాన్ని చూసి తామెంతో విజ్ఞానాన్ని పొందుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. తాజాగా నిజామాబాద్‌లోని నలంద పాఠశాల విద్యార్థులు పాపారావు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు.

రైతు పాపారావు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాగు చేసే పంట వద్దకు ప్రకృతిలోని పక్షులు, భూమికి మేలు చేసే సరీసృపాలు, వివిధ రకాల మేలు చేసే క్రిమికీటకాలు, వానపాములు వస్తేనే అసలైన ప్రకృతి పరిరక్షణ అన్నారు. ప్రకృతి విధానంలో పండిన ఉత్పత్తులను తక్కువ ప్రమాణంలో తిన్నప్పటికీ ఎనలేని శక్తి కలుగుతుందని వివరించారు. విచ్చలవిడిగా పురుగుమందులు,

వివరాలు తెలుసుకుని.. ఆసక్తి పెంచుకొని..

రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా సాగు చేస్తున్న తీరుతోపాటు గోకృపామృతం, జీవామృతం, కషాయాలు తయారు తదితర అంశాలను విద్యార్థులు ఆసక్తిగా తెలుసుకున్నారు. సుభాష్ పాలేకర్ విధానంలో చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని చూసి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

రసాయన ఎరువులు వేసి పండించిన పంటను తింటే విటమిన్స్ బదులు కెమికల్స్ శరీరంలోకి వెళ్లి రకరకాల వ్యాధులకు కారకమవుతాయన్నారు.



వ్యవసాయ క్షేత్రంలోని వివిధ రకాల పండ్ల చెట్లు


వ్యవసాయ శాస్త్రవేత్త అవ్వాలనుంది



వ్యవసాయం గురించి తెలుసుకునేందుకు ఇక్కడకు రావడం సంతోషంగా ఉంది. పైగా ప్రకృతి విధానంలో వ్యవసాయం చేస్తుండడం మరింత బాగుంది. ఇక్కడి వ్యవసాయ విధానాన్ని చూస్తుంటే భవిష్యత్‌లో వ్యవసాయ శాస్త్రవేత్త అవ్వాలని అనిపిస్తోంది.

– సార్థకి, ఏడో తరగతి

ఎంతో బాగుంది



పంటలు పండించడం, రైతుల కష్టాన్ని, వారి నైపుణ్యాన్ని చూడడం ఎంతో బాగుంది. పాఠశాలల విద్యార్థులందరూ తరచూ ఇలాంటి వ్యవసాయ క్షేత్రాలకు రావాలి. ఇక్కడ చాలా అంశాలను తెలుసుకున్నాను. ఇలాంటి చోట్ల ఎంతో విజ్ఞానం లభిస్తుంది. – అక్షిత్‌కుమార్, ఏడో తరగతి


ఆలోచింపజేస్తోంది



పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్‌తో చేసే వ్యవసాయానికి, ప్రకృతి విధానంలో చేసే వ్యవసాయానికి చాలా తేడా ఉంది. సుభాష్ పాలేకర్ విధానంలో చేస్తున్న వ్యవసాయం ఆలోచింపజేస్తోంది. ఈ విధానంతో భావి తరాలకు ఎంతో మేలు కలుగుతుంది.

– అశ్విత, తొమ్మిదో తరగతి

అగ్రికల్చర్‌లోనే కల్చర్ ఉంది



రైతే రాజు అనే నానుడి సాధారణమైనది కాదు. ఎందుకంటే అగ్రికల్చర్‌లోనే కల్చర్ ఉంది. ప్రకృతి విధానంలో చేస్తున్న వ్యవసాయంతో ప్రకృతి బాగుండడంతోపాటు మానవాళికి మంచి ఆరోగ్యం కలుగుతుంది. ఇలాంటి మంచి విజ్ఞానాన్ని అందిస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించడంతో పాటు విద్యార్థులకు చూపించడం సంతోషంగా ఉంది. – పద్మావతి, నలంద స్కూల్ హెచ్‌ఎం

వ్యవసాయ క్షేత్రాలు చూపించాలి



విద్యార్థులను ప్రకృతి వ్యవసాయ క్షేత్రానికి తీసుకురావడం ఆనందంగా ఉంది. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తరచూ తమ పిల్లలను వ్యవసాయ భూముల వద్దకు తీసుకెళ్లాలి. రైతులతో ఇంటరాక్ట్ అయ్యేలా చొరవ తీసుకోవాలి. అదేవిధంగా పంట సాగుపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వ్యవసాయంలోనే సాయం ఉందనే నిజాన్ని ప్రతిఒక్కరికీ తెలియజెప్పాలి.

– మురళీకృష్ణ, నలంద స్కూల్ ప్రిన్సిపల్

క్లుప్తంగా

దేవాదాయ శాఖ సిబ్బందితో వ్యక్తిగత పనులు

- ఉన్నతాధికారి తీరుపై విమర్శలు

నస్రుల్లాబాద్: దేవాదాయ శాఖకు చెందిన ఉన్నతాధికారి వ్యవహారం చర్చనీయాంశమైంది. సదరు అధికారి నస్రుల్లాబాద్‌లో ఇల్లు నిర్మించుకుంటున్నారు. అయితే కూలీలతో చేయించుకోవాల్సిన పనులను శాఖ సిబ్బందితో చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రెండు నెలలుగా ఈ తతంగం నడుస్తోందని తెలుస్తోంది. దేవాదాయ శాఖ సిబ్బంది సొంత వాహనాలపై సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణించి నస్రుల్లాబాద్‌కు వచ్చి విడతలవారీగా పనులు చేస్తున్నట్లు సమాచారం. శాఖసిబ్బందితో సొంత పనులు చేయించుకుంటున్న అధికారి తీరుపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలు పరీక్ష హాల్లో.. తల్లిదండ్రులు రోడ్లపైన..



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్ష రాయించడానికి పోచంపాడ్ పరీక్షకేంద్రం వద్దకు వచ్చారు. పిల్లలు పరీక్షకేంద్రంలోకి వెళ్లగా, వారివెంట వచ్చి తల్లిదండ్రులు రోడ్డుపైనే వేచిఉన్నారు. రోడ్డులోని డివైడర్‌పై వరుసగా వారు కూర్చోవడంతో 'సాక్షి' క్లిక్ మనిపించింది.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులం, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల గురుకులంలో ఆదివారం నిర్వహించిన టీజీసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బీసీ గురుకులంలో 150 మందికి 148 మంది హాజరయ్యారు. సాంఘిక సంక్షేమ గురుకులంలో 796 మందికి 31 మంది గైర్హాజరయ్యారు. డీఈవో అశోక్, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎంఈవో గేమ్‌సింగ్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

తగ్గిపోతున్న 'ఉపాధి'

- ఏటేటా పని దినాలను తగ్గిస్తున్న కేంద్ర ప్రభుత్వం

మోర్తాడ్(బాల్కొండ): ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇస్తూనే ఉంది. రాష్ట్రానికి నిధుల కేటాయింపులలో కోత విధిస్తుండటంతో జిల్లాలోని కూలీలకు పని దినాల సంఖ్య తగ్గిపోతుంది. ఉపాధి హామీ పథకం కింద ఒక్కో కుటుంబానికి ఏడాదికి వంద రోజుల పని కల్పించాల్సి ఉంటుంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధిహామీ ప్రణాళికను ఖరారు చేయగా గతంలో పోల్చితే పని దినాలు తగ్గిపోయినట్లు వెల్లడైంది. ఉపాధి పనులకు ప్రతి ఏటా డిమాండ్ పెరుగుతుండగా కేంద్రం మాత్రం నిధులను కుదిస్తుండటంతో పని దినాల్లో తేడా కనిపిస్తుంది.

జిల్లాలో 2,56,462 జాబ్ కార్డులు..

ప్రస్తుతం జిల్లాలో జారీ చేసిన జాబ్ కార్డులు 2,56,462 ఉన్నాయి. కూలీలు 4,37,402 మంది పని చేస్తున్నారు. వ్యవసాయ పనులు తగ్గిపోతుండటంతో ఈ నెలాఖరు నుంచి ఉపాధి పనులకు డిమాండ్ ఏర్పడుతుంది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య భారీగానే ఉంటుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని కూలీలకు 66,16,841 రోజుల పని దినాలను కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 3,22,650 పని దినాలు తగ్గిపోయాయి.



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

గడిచిన మూడేళ్లలో ప్రతి ఏటా పని దినాల సంఖ్య తగ్గిపోతూనే ఉంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తున్న నిధులతో తెలంగాణకు మంజూరు చేస్తున్న బడ్జెట్‌ను పరిశీలిస్తే చాలా తేడా ఉంది. పని దినాల సంఖ్యను తగ్గించడం చూస్తుంటే కూలీలకు ఇక ముందు చేతినిండా పని ఉండదని స్పష్టం అవుతుంది. కేంద్రంపై ఒత్తిడి పెంచితేనే ఉపాధి కూలీలకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్ల పని దినాలు ఇలా...

ఆర్థిక సంవత్సరం	పని దినాలు
2022–23	87,97,709
2023–24	70,51,071
2024–25	69,39,491
2025–26	66,16,841

కూలీలకు పని కల్పిస్తాం

కూలీలకు నిబంధనల ప్రకారం పని కల్పిస్తాం. పని దినాలలో తేడా ఉన్నా వేసవిలో మాత్రం అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించడానికి ప్రణాళికను రూపొందించాం. కూలీలకు వారి వారి గ్రామాలలో పనులు చేయడానికి పనుల గుర్తింపు కూడా పూర్తి అయ్యింది.
– సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

పేదింటి బిడ్డ.. క్రీడల్లో దిట్ట

- సాఫ్ట్‌బాల్ ఆటలో రాణిస్తున్న కీర్తన
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో 9 గోల్డ్‌మెడల్స్, 2 సిల్వర్ పతకాలు అందుకున్న వైనం



సాధించిన కప్‌తో సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి కీర్తన

మాక్లూర్: పేదరికంలో పుట్టినా.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా తన క్రీడానైపుణ్యంతో ప్రతిభ చాటుతోంది సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి కీర్తన. మాక్లూర్ మండలంలోని ఒడ్డెట్‌పల్లికి చెందిన దుడ్డు గంగాధర్–సవితల మొదటి కూతురు కీర్తన ప్రస్తుతం సుద్దులం ఎస్సీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. అలాగే ఎంచుకున్న క్రీడారంగంలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని, ప్రతిభ చాటుతూ అతిచిన్న వయస్సులోనే లక్ష్యానికి దగ్గరవుతుంది. తల్లిదండ్రులు పడుతున్న ఆర్థిక కష్టాలను దూరం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇప్పటి వరకు 9 గోల్డ్ మెడల్, 2 సిల్వర్ పతకాలు సాధించింది. అలాగే ఇటీవల జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఫైనల్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుతో ఆమె తెలంగాణ జట్టు తరపున తలపడి కప్‌ను సాధించారు. జట్టు విజయంతో ఆమె ప్రతిభ కనబర్చటంతో విడిగా గోల్డ్‌మెడల్ సాధించింది. దీంతో కీర్తన పేరు జిల్లా సరిహద్దులు దాటింది. ఈక్రమంలో పోటీల అనంతరం ఆమె సొంతూరుకు రాగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, సన్మానించారు.



గోల్డ్‌మెడల్ సాధించిన కీర్తనతో తల్లిదండ్రులు

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం

మాది పేద కుటుంబం. మా అమ్మనాన్నలకు ఇద్దరం ఆడపిల్లలమే. మా నాన్న గతంలో కొన్ని రోజులు దుబాయ్ వెళ్లగా, అప్పులు పెరిగిపోయాయి. ప్రస్తుతం ఆయన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సఫాయి కార్మికుడిగా పని చేస్తున్నాడు. తల్లిదండ్రుల కష్టాలను తీర్చడానికే ఒకపక్క శ్రద్ధతో చదువుకుంటునే ఎంచుకున్న సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నాను. ఎప్పటికైన ప్రభుత్వ ఉద్యోగం సాధించటమే నా లక్ష్యం.
–డి. కీర్తన, సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి

పంటను కాపాడుకునేందుకు పాట్లు



కాకతీయ కాలువ వద్ద ఏర్పాటు చేసిన ఇంజిన్



ఇంజిన్ ద్వారా పంట పొలానికి అందిస్తున్న నీరు

- ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ ఎక్కువవడంతో ఓ రైతుకు దక్కని విద్యుత్ కనెక్షన్
- డీజిల్ ఇంజిన్‌తో సాగు నీరు సరఫరా చేయాల్సిన పరిస్థితి
- కనెక్షన్ ఇప్పించాలని వేడుకోలు

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంకు చెందిన రైతు బాజన్న తన ఎకరం పంట భూమికి మోటార్ ద్వారా నీరు అందించడానికి డీజిల్‌తో నడిచే ఇంజిన్ ఏర్పాటు చేసుకున్నాడు. దూదిగాం శివారు గుండా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే కాకతీయ కాలువ ప్రవహిస్తుంది. దీంతో కాలువ అంచున పంటపొలాలు ఉన్న రైతులు పంపుసెట్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకొని మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ పొలాలకు అందిస్తున్నారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్‌కు లోడ్ ఎక్కువవడంతో బాజన్న పంపుసెట్‌కు విద్యుత్ కనెక్షన్ రాలేదు. సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలంటే ఖర్చుతో కూడుకున్నది. అలాగే ఒక్క మోటార్‌కు అంత విద్యుత్ అవసరం ఉండదు. దీంతో సదరు రైతు మోటార్‌కు డీజిల్‌తో నడిచే ఇంజిన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. రూ.200 డీజిల్ పోస్తే రెండున్నర గంటలు నీటి సరాఫరా చేస్తుందని రైతు బాజన్న తెలిపారు. ఈ సమయంలో ఎకం పొలంలోని వరి పంటకు, మామిడి చెట్లకు నీరు అందుతుందన్నారు. కానీ వరికి నిత్యం నీరు అవసరం కావడంతో సగటున రోజుకు రూ.300 ఖర్చు తప్పడం లేదంటున్నారు. తాను సాగు చేయగా వచ్చే మొత్తంలో సగం కంటే ఎక్కువగా డీజిల్ ఖర్చుకే అవుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తనకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతున్నాడు.



బాజన్న

43 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు

రుద్రూర్: మండల కేంద్రంలోని బాలుర జెడ్పీ హైస్కూల్‌లో 1981–82 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు 43ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోట కలిశారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆనాటి విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాడు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.

రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, రవికిరణ్, రాధారాణి, పూర్వ విద్యార్థులు నారాయణ, ప్రభాకర్, శ్రీనివాస్ బాబా, శానం శంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిలు, కిష్టయ్య, గణేష్ పాల్గొన్నారు.



రుద్రూర్ జెడ్పీ హైస్కూల్ 1981-82 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

సాలూరలో 17 ఏళ్లకు..

బోధన్: సాలూరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. 17ఏళ్ల తర్వాత ఆనాటి విద్యార్థులందరూ మళ్లీ కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని, నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి, సన్మానించారు.

చౌట్‌పల్లిలో 26ఏళ్లకు..

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం' నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నవ్వులు పూయించారు. గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి పాదాభివందనాలు చేసి, ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సహ పంక్తి భోజనాలు చేశారు.



సాలూర జెడ్పీహెచ్‌ఎస్ 2007-08 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



చౌట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



జంగంపల్లి గ్రామ పెద్ద చెరువులో మట్టి రాసుకొని సూర్యనమస్కారాలు చేస్తున్న యువకులు

'మట్టి స్నానం ఆరోగ్యానికి మంచిది'

భిక్కనూరు: మట్టి స్నానం ఆరోగ్యానికి మంచిదని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జంగంపల్లి గ్రామ పెద్ద చెరువులో మట్టి స్నానాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టమట్టి, ఆవు పేడ, ఆవు మూత్రం సుగంధ ద్రవ్యాల మిశ్రమాన్ని శరీరానికి పట్టించి ఎండలో ఎండిన పిదప చెరువులో స్నానం చేయడం ద్వారా స్వేద రంధ్రాలు శుభ్రం అవుతాయన్నారు. దీంతో శరీరానికి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ కార్యదర్శి పి.అంజయ్య, ప్రతినిధులు సిద్ధగౌడ్, వెంకటేష్, ఈశ్వర్, పోచయ్య, లక్ష్మీపతి, యోగా గురువు అంతిరెడ్డిలు పాల్గొన్నారు.

విషమంగా చిన్నారి ఆరోగ్య పరిస్థితి

రామారెడ్డి: మండలంలోని స్కూల్ తండాకు చెందిన ఇద్దరు అక్కచెల్లెలు శనివారం ఇంట్లో ఉన్న పురుగుల మందును జ్యూస్‌గా భావించి తాగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో చిన్నారులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి సిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. అక్క గంగవత్ సంజన ఆరోగ్యం బాగానే ఉన్నా, చెల్లెలు బిందు పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు తండావాసులు తెలిపారు.

తాండూర్ అటవీ ప్రాంతంలో మళ్లీ మంటలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ శివారులో గల అటవీ ప్రాంతంలో ఆదివారం మళ్లీ మంటలు చెలరేగాయి. గురువారం రాత్రి అదే ప్రాంతంలో మంటలు చెలరేగాయి. మళ్లీ రెండోసారి మంటలు చెలరేగడంతో అటవీశాఖ అధికారులు విషయం తెలుసుకొని ఫైరింజన్ సహాయంతో మంటలను ఆర్పించారు. కాగా గడిచిన వారం రోజుల్లోనే తాండూర్ శివారులోని అటవీప్రాంతంలో రెండుసార్లు మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీప్రాంతంలోకి వెళ్లే పశువుల కాపర్లు, మేకల, గొర్ల కాపరులు వెలిగించిన బీడీ, సిగరేట్ ముక్కలను ఆర్పకుండా పడేయడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయా?, లేక ఎవరైనా కావాలనే నిప్పు పెడుతున్నారా అనే విషయాన్ని అధికారులు గుర్తించాల్సి ఉంది.

క్రైం కార్నర్

మొరం ట్రాక్టర్ల పట్టివేత



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. తిమ్మాపూర్ క్రాస్‌రోడ్ వద్ద ట్రాక్టర్‌లో మొరంను తరలిస్తుండగా, పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. బాధ్యుడైన బండారు ప్రభాకర్‌తో పాటు, ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



ఎడపల్లి(బోధన్): మండలంలోని బాపునగర్‌కు చెందిన కట్కూరు రాములు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. రాములు శనివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో రాములు భార్య నాగజ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాములు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కాఫీ కలర్ షర్ట్ ధరించాడన్నారు. ఎత్తు 5.6 అడుగులు ఉంటాడని, తెలుగు, హిందీ భాషలు మాట్లాడుతారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సమీపంలోని రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్సై విజయ్‌కొండ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కెనాల్‌లో పడి ఒకరి మృతి

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఏఆర్‌పీ క్యాంపు గ్రామంలోగల డీ46 కెనాల్‌లో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి నీటిలో మునిగి మృతిచెందాడు. వివరాలు ఇలా.. మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్‌కు చెందిన వినోద్(30) ఏఆర్‌పీ క్యాంప్‌లోని ఇటుక బట్టీలో పనిచేయడానికి మూడు రోజుల క్రితం వచ్చాడు. ఈక్రమంలో ఆదివారం కాలకృత్యాల కోసం డీ46 కెనాల్‌కు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. ఈమేరకు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ..

ఖలీల్‌వాడి: అర్సపల్లి, జాన్కంపేట్ రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళ(50) రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. అర్సపల్లి రైల్వే గేటుకు 200 మీటర్ల దూరంలో ఒక గుర్తు తెలియని మహిళ రైలు ప్రమాదంలో మృతిచెందినట్లు స్టేషన్ మేనేజర్ సీహెచ్ సాగర్ పోలీసులు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైతునగర్‌లో క్షుద్రపూజల కలకలం

బాన్సువాడ: బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో శనివారం రాత్రి క్షుద్ర పూజల కలకలం రేగింది. ఇళ్ల ముందు పిండితో తయారు చేసిన బొమ్మ, నిమ్మకాయలు, పసుపు బియ్యం ఉండడంతో గ్రామస్తులు భయందోళనకు గురయ్యారు. వివరాలు ఇలా.. రైతునగర్ గ్రామానికి చెందిన గూల పోచవ్వ అనే మహిళ పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. శనివారం రాత్రి ఇంట్లో నిద్రించగా అర్ధరాత్రి వేళ కుక్కల అరుపులతో మెలకువ వచ్చింది. దీంతో ఆమె బయటకి వచ్చి చూడగా ఇంటి ముందు పిండితో చేసిన బొమ్మ, నిమ్మకాయలు, పసుపు కలిపిన బియ్యం కనబడడంతో అరుపులు చేస్తూ చుట్టుపక్కల వారిని నిద్రలేపింది. అలాగే మరో మహిళ ఉప్పరి హన్మవ్వ ఇంటి ముందు కూడా నిమ్మకాయలు పడి ఉన్నాయి. సీసీ రోడ్డుపై అక్కడక్కడ రక్తం మరకలు కూడా ఉన్నాయి. దీంతో కాలనీవాసులందరూ రాత్రంతా భయంభయంతో గడిపారు. ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. నాలుగైదు రోజులుగా కాలనీలో ఒక్కొక్కరి ఇంటి ముందు ఇలా ఉంటున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఎవరో కాలనీ వాసులను భయపెట్టాలనే దురుద్దేశ్యంతో ఇలా చేశారా? లేక.. గుప్తనిధుల కోసం కాలనీని ఖాళీ చేయాలనే ఉద్దేశ్యంతో చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వెంటనే పోలీసులు స్పందించి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇంటి ఎదుట వేసిన పసుపు బియ్యం